# సంపదా— సంస్కారమా?!

మాధవీ, కుమారీ, లతా, లక్ష్మి, కాత్యాయనీ అర్జంటుగా సమావేశమయ్యారు సునీత యింట్లో. ఈ సంవత్సరమే ఎమ్మే పూర్తి చేసిన ఆ స్నేహ బృందం దృష్టిలో ఆ సమావేశం చాలా ముఖ్యమైనది.

''నువ్వు ఫోన్‌లో చెప్పినది నిజమేనా?'' అని ఒకరి నొకరు పదిసార్లైనా ప్రశ్నించుకున్నారు. అందరూ ప్రశ్నలడిగేవారే కానీ సమాధానాలు ఖాతరు చేసేవారు లేరు.

''ఇంతకీ మన శ్యామల యింత పిచ్చిపని ఎందుకు చేసిందంటావు?''

అందరూ అడిగేవారే సమాధానం ఎవ్వరికీ తెలియదు.

''ఘోరంగా లేదూ ఈ సంగతి?'' అని ఒకరంటే.

''ఘోరాతి ఘోరంగా వున్నద''ని ఇంకొకరూ.

''అతి దరిద్రం''గా వున్నదని మరొకరూ విశ్లేషించారు.

తర్జన భర్జనలు జరిగాయి.

శ్యామలపై విమర్శలూ, సానుభూతి వరం వరలూ అన్నీ అయ్యాయి.

''ఇంతకూ ఏం జరిగింది శ్యామలకు? ఎందుకీ సానుభూతి సభ?'' అనడిగింది అప్పుడే వచ్చిన సత్యవతి.

''అయ్యో ఏం జరిగిందని మెల్లగా అడుగుతున్నావా? తనేమో ఇంతా ఎమ్మే చదివిందా? ఫస్ట్‌క్లాస్ 'ప్యూర్' కూడా! ఒక మామూలు బియ్యేగాడిని పెళ్ళి చేసుకుంటోందట, ఇక పది రోజులే వుందట అంతా నిశ్చయమైపోయిందట!''

''హతోస్మి! ఎంతవమానం! దానికే కాదు మనకందరికీ అవమానమే యిది. ఇంతకూ ఎలా వచ్చిందీ వార్త?''

గర్వంగా చూచింది లత.

''ఇదిగో వెడ్డింగ్ కార్డు! మా ప్రెస్‌లోనే అచ్చవుతున్నాయి. అందుకే నాకు ముందుగా తెలిసింది.''

''ఓ పని చేద్దాం. దాన్నే అడుగుదాం వాళ్ళ యింటికి వెళ్ళి. అసలు యింత ఘనత వహించిన స్నేహిత బృందం వుండగా, మనను సంప్రదించకుండా కనీసం మాటైనా చెప్పకుండా యింత అవమానకర కార్యమెలా చేస్తోందో నిలదీసి అడుగుదాం. ఛీ తనకంటె తక్కువ చదివిన వాడిని పెళ్ళాడటమా?''

సత్యవతి సలహా అందరికీ నచ్చింది.

తుఫానుగాలులవలె వచ్చిన స్నేహితురాండ్రందరినీ చిరునవ్వుతో, గాంభీర్యం చెక్కుచెదరకుండా పలుకరించింది శ్యామల.

నోరు నొప్పెట్టేవరకూ అందరూ ఒకేసారి బిగ్గరగా ప్రశ్నలు కురిపించారు, తిట్టారు, విమర్శించారు శ్యామలను.

ఈ దండయాత్రా సన్నాహాన్నీ, నిష్ఠురాలనూ ఇంకా యింట వున్న పెద్దలూ, బంధుబలగమూ వింటున్నారనే భయ సంకోచాలేమీ లేవు ఆ బృందంలో ఎవరికీ!

అసలు ఈ మూక ఉమ్మడి గోలలో ఎవ్వరి మాటా స్పష్టంగా విన్పించడం లేదనే జ్ఞానం కూడా లేదు వారిలో ఒక్కరికైనా.

లోపలినుండి శ్యామల తల్లి అందరికీ మిఠాయిలూ, చల్లని పానీయాలూ పంపడంతో, తాత్కాలికంగా అరుపులూ, కేకలూ మాని వాటిని ఉద్ధరించడంలో నిమగ్నమయ్యారు.

ఇప్పటికి శ్యామలకు పెదవి మెదపే అవకాశం లభించింది.

''ఏమంత ఘోర పాపం చేశానే ఇంతగా ముద్దాయిని బోనులో నిలబెట్టి అడిగినట్లు నిలేస్తున్నారు?'' అన్నది.

ఉపాహారాలూ, పానీయాలూ శక్తిని అధికం చేశాయేమో మళ్ళీ రణగొణ ధ్వని ప్రారంభమైంది.

రెండు చేతులూ జోడించి మరీ అన్నది శ్యామల.

''తల్లుల్లారా! ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కసారి మాట్లాడండి అలా అంతా ఒకేసారి శివమెత్తి గెంతుతూంటే నాకు దడ వస్తోంది. ఈ యింటి కప్పు ఎగిరిపోతుందేమోనని లోపల పెద్దవాళ్ళు గాభరా జెందుతున్నారు.''

''ఈ చచ్చు జోకులకేంగానీ, సరే నేనడుగుతున్నాను చెప్పు నీ పెళ్ళి కుదిరిందా?''

లత సీరియస్‌గా కాలుపై కాలు వేసుకుని ప్రశ్నావళి ప్రారంభించింది.

''ఔనూ అయితే?''

''నోర్మూయ్, మమ్మల్నెవర్నీ అడగాలని తెలియలేదా?'' శ్యామల అమాయకత నటించింది.

''ఎలా అడగనే? మీరూ ఆడవాళ్ళేగా? నాకావలసింది భర్తకదా?''

''మరో చచ్చు జోకు యిది. 'నీ పెళ్ళి ఎవరి నడిగి నిర్ణయించుకున్నావూ?' అని.''

''ఊఁ....నా మనసు నడిగి.''

''ఆ మనసుకేదో పిచ్చెక్కడమో మత్తెక్కడమో జరిగివుండాలి లేకుంటే నీకంటె

తక్కువ చదువుకున్నవాడూ, ఏ ఉద్యోగమూ లేనివాడూ అయిన వాడి వెంట ఎందుకు వస్తుంది?''

శ్యామల మౌనంగా చూస్తూండిపోయింది.

ఈ మౌనం లతా ప్రభృతులకు మరింత బలాన్నిచ్చింది.

''ఎవరైనా బలవంతంగా ఒప్పించారా? లేక వాళ్ళకు మీరేమైనా ఋణపడి వున్నారా?''

ఒక్కరు మాట్లాడాలనే నియమోల్లంఘన చేసి మళ్ళా అందరూ అలజడి లేవదీశారు.

''ఆడవాళ్ళు తమకంటె తక్కువవాళ్ళను పెళ్ళి జేసుకుంటే ఎంతవమానం! అసలదెంత వికృతంగా విన్పిస్తుంది?''

''ఎందుకూ? నాకేం అలా అన్పించడం లేదే?''

## ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

''అందుకేగా నీకు పిచ్చెక్కిందేమోనని ఏడుస్తున్నాం మేమంతా? ఇప్పుడైనా మించి పోయిందిలేదు. మీ వాళ్ళకు ఈ సన్నాసి పెళ్ళి వద్దని చెప్పేసెయి నీకు మేమంతా అండగా నిలబడతాం.''

ఇప్పటికి శ్యామల తన నవ్వులాట కట్టి పెట్టి గంభీరంగా చెప్పింది.

''ఈ వివాహం నేనే కుదుర్చుకున్నానే లతా, ఆ మధ్య సెలవులకు ఓ పెళ్ళికి వెళ్ళాను మా వూరు. ఆ వూళ్ళో ఆయనతో పరిచయమైంది. నేను డిగ్రీని చూడలేదు. ఆ బియ్యే డిగ్రీ కాదు సరికదా, కనీసం మెట్రిక్ కూడా కాకపోయినా నేను చేసుకొనే దాన్నే సుమా!''

''అలాగా?''

అతినీరసంగా అన్నారు అందరూ.

''ఔను లతా ఆయనలో అంతటి సంస్కారం దాగి వున్నది గనుక!''

''ఏమిటో చెప్పు కాస్త విని తరించుతాం.''

''రెండేళ్ళుగా మనందరికీ కూడా మన వాళ్ళు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు ఔనా?''

''ఔనూ అయితే?''

''ఏదీ? ఒక్కళ్ళకి కాలేదు వివాహం.''

''అందుకనీ? ఆ ఊళ్ళోనే మాకందరికి తలా ఒకడినీ ఎంచి పెట్టి రాలేదుకదా మన్వ?''

''లేదులే మీ స్వభావాలు నాకు తెలుసుగా?''

''అహా! ఏమిటే మా స్వభావాలు?''

''ఎంత కట్నం యిస్తారు? లాంఛనా లేమిస్తారు? వంట చేస్తుందా? ఉద్యోగం కూడా చేస్తుందా? నడిపించి చూపండి, పాట పాడించండి. పెండ్లిలో మా కాళ్ళు కడిగి నెత్తిన జల్లుకోండి ఆ కాళ్ళు కడిగే పళ్ళెం కూడా వెండిదే సమర్పించుకోండి...''

''ఇలాగేగా వున్నారు. ఇంతవరకూ మనలో ఎవరిని చూచుకోవడానికొచ్చిన పెళ్ళి వారైనా?''

ఈ జవాబు విన్న లత బృందంలోని వారెవరూ నోరెత్తలేదు. ఒకరి నొకరు దొంగ చూపులు చూచుకోసాగారు.

''ఇటువంటి హీనమైన బేరసారాలేమీ లేవు మా మధ్య. నేను చదివిన తాను చదివిన పుస్తకాలలో పాత్రలపై చర్చలూ, ఇంకా పై చదువుల ఆలోచనలూ, ఆ పల్లెలోని వారందరికీ మేమిద్దరం వయోజన విద్యా శాలను నడపాలనే నిర్ణయమూ, గ్రామ పురోభి వృద్ధికి పాటు పడాలనే ఆకాంక్ష తత్సం బంధమైన చర్చలూ ఇలాగే సాగిపోయాయి కానీ అతడు నన్ను డబ్బు మూటగా చూడ లేదు. నా తండ్రిని ఏమీ యాచించలేదు. ఏ విధంగానూ తన పురుషాధిక్యతను ప్రద ర్శించలేదు. ఒకరి కొకరం తోడు నీడల మధ్యే పవిత్ర బంధంలోనికి సరిసమానులుగా ప్రవేశిస్తున్నాం. కానీ అల్పాధిక్యతలను ప్రద ర్శించే తంతుల జోలికి పోవడంలేదు.''

''అంటే రిజిష్టర్డ్ మ్యారేజా?''

''ఔను. కానీ పెద్దల సమక్షంలో. ఇప్పుడు చెప్పండి మీరంతా లోగడ మనలను చూచు కోవటానికొచ్చిన పి హెచ్ డి లూ, ఎమ్బి బియస్‌లూ, ఇంజనీర్లు ఏమేమి అడిగారు? సమాన హక్కులో అని వాదించే మనమే మన భర్తలు మనకంటె అధికంగా వుండా లనుకోవడం హాస్యాస్పదంగా లేదూ?''

''............''

''చెప్పండే మాట్లాడరేం? చదువుకున్నది వంట చేస్తుందా' అనే అనమాన జాడ్యపు ప్రశ్న 'మా మా చదువులకింత ఖర్చైంది గనుక అది యిచ్చి మమ్మల్ని కొనుక్కోండి' అనే దేవిరింపులు, 'ఇంటికేమేమి వస్తువులు సమర్పించుకొంటా'రనే సిగ్గుమాలిన అడు క్కోవడాలు, తమ స్నేహితులెవరెవరో విదే శాలు వెళ్ళారు గనుక తామూ మామగార్ల ఖర్చులలో విదేశాలు పోకపోతే ఆ దేశాలు చిన్నబుచ్చుకుంటాయనే నీతులు, మీ కూతుళ్ళు ఉద్యోగాలు చేసి తెచ్చే జీతంపై హక్కు మీదా, మాదా?' లేక పంపకం నిష్పత్తి ఏమిటనే మీమాంసలు ఇవేగా లతా ఇంతవరకూ మనకు తారసపడిన వ్యక్తుల స్వభావాలు?''

'ఔ'నని నోటితో చెప్పలేక అందరూ తలలు వంకించారు.

''అటువంటి అల్పత్వమూ, నా సంపా దనా సంపదల ప్రసక్తే లేక నా వ్యక్తిత్వానికి విలువనిస్తూన్న వివాహం యిది, డబ్బు పిచ్చితో వ్యక్తిత్వపు విలువలను విస్మరించిన ఈ రోజులలో ఇంతటి మహోన్నత సంస్కా రాన్ని కొలిచే డిగ్రీ ఏదీ లేదని నా అభి ప్రాయం. ఇలాగే మనకంటె తక్కువ చదువు కున్నవారిని వివాహమాడటం నామోషీ అనే దురభిప్రాయాన్నీ, దురభిమానాన్నీ మన యువతులు విడనాడిన నాడు నేటి మన వివాహ వ్యవస్థ కొంత మెరుగుపడవచ్చు. వరుని డిగ్రీని, సంపదనూ కాక అతడి సంస్కారాన్ని వధువు గుర్తించడం ధర్మం.'' □